ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. పిల్ల లందరూ స్కూళ్లకి వెళ్లిపోయారు. మండువా స్తంభం మీద ఉన్న పిచ్చిక గూట్లో నించి వేళ్లాడుతున్న గడ్డిపరకలు చిన్నగాలికి రిప రిప మని సన్నని శబ్దంతో ఆడుతూన్నాయి.

ఒక్కక్షణం గడిచింది. "ఈ ఊరొచ్చిన ఈ మూడు నెలల్లో మీరు నా కిచ్చిన మనశ్శాంతి మరి ఏ మిత్రులూ ఇవ్వలేదమ్మా. దూరపు బంధువులైనా రాధ వాళ్ల కుటుంబం చేస్తున్న సహాయం మరి ఏ బంధువులూ చెయ్యలేదమ్మా." అంది అలివేలమ్మ మనస్ఫూర్తిగా నిమ్మళమైన స్వరంతో.

"అమ్మా! మనుష్యులమై పుట్టామండీ! ఒకళ్లకి ఒకళ్లం సహాయం చేసుకోవడం విధికాని మన గొప్పతనం కాదండి" అన్నాను ఎదురుగా కూచుని ఏదో నాకు తోచినట్టూ.

అలివేలమ్మగారు చిరునవ్వు తెచ్చిపెట్టుకున్నారు, తెలిసీ తెలియకుండా.

తిరిగి చుట్టూ నిశ్శబ్దం. ఉన్నట్టుండి ఎక్కడి నుంచో తల్లి పిచ్చుక నోట్లో ఏదో కరచి పెట్టుకుని బయటి నుంచి ఎగురుతూ, తిరుగుతూన్న ఫాన్ మీది నించి వచ్చి గూట్లోకి వెళ్లింది. గూడంతా కీచు కీచు మని శబ్దాలు, తల్లి నోట్లో ఉన్న ఎర కోసం. ఒక్క రెండు క్షణాల్లో తల్లి పిచ్చుక తిరిగి బయటికి ఎగిరిపోయింది. గూడంతా నిశ్శబ్దం అయింది తిరిగి.

"ఏ పాపమూ చెయ్యని నా కొడుకుకి ఎందుకమ్మా ఈ శిక్ష?" అంది అలివేలమ్మగారు ప్రశ్నార్థకంగా.

"ఏ దడిగితే అది ఇచ్చి, ఏ కొరతా లేకుండానే పెంచానమ్మా వాడిని. పైగా ధర్మారావుగారి లాంటి ఆదర్శ కుటుంబంలో పెట్టి చదివించాను. తండ్రిలేని కొరత లేకుండా పెరిగాడు. వాడే నాకు సర్వస్వం. వాడు లేకపోతే నాకు జీవితమే లేదు. వాడిని కాపాడుకోలేకపోతున్నాను'' అంటూ, తల ఇంకా స్తంభానికి వెనక్కి వాల్చింది, నిస్సహాయంగా.

నాకూ ఏమనాలో తోచలేదు. "ఏ దోషమూ ఎరుగని గోపికి పిచ్చిపట్టింది. ఎందుకమ్మా భగవంతుడు నా కడుపు ఇలా దేవుతున్నాడు!'' అంది దీనంగా తనలో తాను అనుకున్నట్టు నన్ను ఉద్దేశించి.

"గోపిని కన్నందుకు మీరు భాగ్యవంతులు. అది నిజం. గోపి చాలా మంచివాడమ్మా" అన్నాను నేను.

"ఏది మంచో, ఏది చెడ్డో ఏమోనమ్మా. అసలు దేవు డున్నాడా? దేవుడికి న్యాయం ఉందా? అమ్మా! నేను మీ పూజ గదిలోకి కాస్త వెళ్లిరానా?'' అంటూ, బరువుగా లేచి గది వేపు నడిచిందావిడ.

ఆ కన్నతల్లి కన్నీళ్లు ఎవరు తుడవగలరు అని ఆలోచిస్తూ, నేనూ లేచి వంట ఇంట్లోకి వెళ్లాను. నాకు కూడా గుండెలు బరువుగానే ఉన్నాయి. నా వంటింటి పనులలో ఈ జరిగిన మూడు నెలల బాధలూ జ్ఞాపకం వచ్చాయి - వరుసగా. గోపి విద్యావంతుడు, రూపసి, యోగ్యుడు. రాధ కుటుంబం మనకి చాలా దగ్గర మిత్రులు. మొట్టమొదటి సారిగా గోపినీ, వాళ్లమ్మగారినీ రాధ ఆమె భర్త బ్రహ్మయ్యగారు తీసుకుని వచ్చారు. పరిచయం కాగానే గోపి తన దోసిళ్లల్లో ఉన్న నాలుగు గులాబి పువ్వులూ నా కిచ్చాడు. మొదటి పువ్వు ఇస్తూ, ఇది అమ్మ పేరుతో అందుకో అక్కా. ఈ రెండవది నా భార్య కమల పేరుతో. మూడవది నా కొడుకు ప్రసాద్ పేరుతో. ఈ నాలుగవది నీ తమ్ముణ్ణి నేను ఇస్తున్నాను అంటూ ఒక్కొక్కటిగా ఇచ్చాడు. బ్రహ్మయ్యగారు జాలిగా చిరునవ్వు నవ్వారు. గోపి స్వతంత్రంగా ఎదురుగా సోఫాలో కూచున్నాడు. తన చంకలో ఉన్న సన్నని పొడుగుపాటి పచ్చి కర్రని తీసి చేత్తో పట్టుకుని ఇల్లంతా కలియజూచాడు. చేతిలో కర్రపుల్ల, కళ్లల్లో ఆ పిచ్చి చూపులూ లేకపోతే గోపి అందరిలాగానే కనిపిస్తాడు.

అప్పట్నించీ ఏమాత్రం వ్యవధి దొరికినా మన ఇంటికి వచ్చేసేవాడు. అయితే ఒకటి. వీధిలో నించే, "జెండాపై కపిరాజు, ముందు సితవాజ శ్రేణియున్.." అని గట్టిగా గొంతెత్తి పాడుకుంటూ మరీ వచ్చేవాడు. ఆ పాట వినంగానే ఇంట్లో పిల్లలు "పిచ్చన్నయ్యా వస్తున్నాడ్రోయ్'' అని మొదలెట్టేవారు, పెద్దవాళ్లకి వినబడ కుండా. అలాగే పాడుకుంటూ తిరిగి రాధ ఇంటికి వెళ్లిపోతాడు. ఒకసారి అన్నాడు గదా "నేను ఒక పుస్తకం రాశానక్కా అది బావగారితో చెప్పి పబ్లిష్ చేయించు'' అని. అంతలోకే చావిట్లోకి వస్తున్న మా వారు - "అది ఏం పుస్తకం గోపీ?" అని అడిగితే గోపి వినయంగా "పుస్తకం పేరు మేన్ ఈజ్ ఎ ఫూల్" అన్నాడు వినయంగా.

"బాగానే ఉంది. రాసింది తీసుకురా,'' అన్నారాయన.

"ఇదిగో ఇక్కడే ఉందిగా!" అన్నాడు గోపి తన తల తనవేలుతో చూపించు కుంటూ. ఇదీ వరస. ఏదీ పట్టించుకోడు. నిర్బంధం పెడితే తప్ప భోంచెయ్యడు. డాక్టర్లని సంప్రదిస్తూనే ఉన్నారు. రోజులు గడుస్తూనే ఉన్నాయి. తగ్గుదల మాత్రం లేదు. ఇప్పుడు ఈ పెద్ద ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్చారు.

కాసేపయ్యాక అలివేలమ్మ పూజ గదిలోనించీ చావిట్లోకి వచ్చారు. నేను కూడా కొయ్యడానికి గోంగూర కట్టలు చేటలో పెట్టుకుని వెళ్లి కూచున్నాను. ఆవిడకి ఎదురుగా. ఆ మరుక్షణం బ్రహ్మయ్యగారు అమిత కోపంగా అంగలేసుకుంటూ చావిట్లోకి వచ్చారు.

వస్తూనే, "చూశావా అమ్మాయ్ ఈ దౌర్భాగ్యుడు ఏం చేశాడో! వాళ్ల కాళ్లా వీళ్ల కాళ్లా పట్టుకొని ఇంత పెద్ద ఆస్పత్రిలో చేరిస్తే దక్కించుకున్నాడా అంట." అని అరిచారు. అసలే ఆయన స్వరం సింహగర్జన. అలివేలమ్మగారి ముఖం వెల వెల బోయింది.

"నేనిప్పుడా డాక్టర్ల ముఖాలు ఎలా చూడ్డం. నా మర్యాద ఏమయింది చెప్పండి." అన్నారాయన, చివరగా ఆవిడగారి ముఖం కేసి కూడా ఒక్కసారి చూస్తూ.

"ఏమయిం దన్నయ్యా? ఏమయింది చెప్పండి'' అన్నాను గాభరాగా నేను.. "మొదట కూచోండి." అన్నాను.

"ఏమయింది! ఆస్పత్రిలోనించీ ఎవ్వరికీ చెప్పా చెందకుండా పారిపోయాడుట వాడు. నేను ఎప్పట్లా వెళ్లాను గదా, బెడ్డు ఖాళీ! కొయ్యబారిపోయానంటే నమ్మి'' అన్నా రాయన.

"స్థిమిత పడం డన్నయ్యా, మతి స్థిరత లేనప్పుడు ఏ తప్పులైనా చేస్తారు లెండి. మీకు తెలియని దేముంది?'' అన్నారు.

"అంతా ఈవిడగారి ముఖం చూచేగా అమ్మా" అన్నా రాయన అలివేలమ్మ గారిని చూపిస్తూ.

"కంగారుపడకం డన్నయ్యా, అతను తెలిసి తప్పు చేశాడా ఏమన్నానా." అన్నాను సర్దుబాటుగా. కాని నాకు కూడా గుండెలు కొట్టుకుంటూనే ఉన్నాయి.

"మొట్టమొదట గోపిని వెతకాలి మనం'' అన్నాను. అలివేలమ్మగారి కళ్లు నీళ్లతో నిండాయి.

"ఆ! వెతకడమూ అయింది. ఎక్కడా అయిపు లేదు. ఏం చెయ్యమంటా వమ్మా" అన్నారాయన ఆందోళనగా.

అంతలోనే హడావుడిగా గాభరాపడుతూ రాధ పరిగెట్టుకుంటూ వచ్చింది.

"మీరు వచ్చేశారా! ఇంకా నయం! వాడు గోపి ఇంటికి వచ్చేశాడు. ఎలా వచ్చాడు?" అడిగింది తొంతర తొందరగా.

"అలివేలమ్మగారు ఛటుక్కున లేచి రాధ ఇంటికి పరిగెట్టింది.''

"గోపి ఏం చేస్తున్నాడు? ఎలా ఉన్నాడు" అడిగాను నేను రాధని.

"మరీ పిచ్చిగా ఉన్నాడు. ఆ పుల్ల చేత్తో తిప్పుకుంటూ పాటలు పాడుతూనే ఉన్నాడు. ఏం చెయ్యాలో నాకేమీ తోచటం లేదు'' అంది రాధ – మనోబాధతోనే.

"అన్నయ్యా! మీరు ఆ డాక్టర్ని స్వయంగా చూచి అడగండి. ఇంకా ఎన్నాళ్లు, ఎటువంటి ట్రీట్‌మెంట్ అని తెలుసుకుందాం. వాళ్లకి తెలుస్తుంది. వాళ్లు కోపంగా ఉండరు" అన్నాను, బ్రతిమాలినట్టూ.

మరేనండీ! కాస్త ఓపికగా ఉండి గట్టెక్కాలి. నట్టేట్లో ఎలా వదలడం? కాస్త అడగండి" అందుకుంది రాధ. బ్రహ్మయ్యగారు కాస్త ఆలోచించారు.

"ఏం నాకు మాత్రం బాధగా లేదా? సరే సాయంత్రం డాక్టర్ని వెళ్లి చూస్తా." అన్నారు లేస్తూ.

మధ్యాహ్నం భోజనం వేళకి అనుకోకుండా టూర్ నించి మరిది శివుడు వచ్చాడు. ఎప్పట్లా ప్రయాణం భోగట్టాలు కబుర్లతో భోజనా లయినయి. అతను జానపద సాహిత్యం మీద ఏదో పేపరు ఒకటి ప్రకటించబోతాడుట. దాని కోసం దేశం నాలుగు మూలలూ తిరిగి ఏవేవో సేకరించుకుని వచ్చాడు ఈసారి. అన్నీ ఆవేశంతో చెబుతున్నాడు. అవేవీ నాకు సోకడంలేదు ఈవేళ. భోజనం చేసి శివుడు మేడ మీద తన గదిలోకి వెళ్లి, తను తెచ్చుకున్న కేసెట్లు టేప్ రికార్డరులో వేసుకుంటూ ఆపుకుంటూ ఏవేవో నోట్సు రాసుకుంటున్నాడు. నే నేమో క్రింద

ఉయ్యాలలో పడుకున్నాను, విశ్రాంతిగా. నిద్ర పట్టనూ లేదు. పొద్దు వాలుతోంది. చుట్టూ అంతా నిశ్శబ్దం అప్పుడప్పుడు శివుడు గదిలోనించీ వచ్చే కేసెట్ల పాటలు తప్ప. ఆ పాటలు గాలిలో కలిసిపోతున్నాయి. నా మనస్సు ఎక్కడో ఉంది.

ఉన్నట్టుండి ఛటుక్కున వీధిలోనించి "జండాపై కపిరాజు..." అంటూ పాట వినిపించింది పెద్దగా. వినిపించడం ఏమిటి, వెనకాలే గోపీ రానే వచ్చేశాడు, చావిట్లోకి అంగల మీద. నిజంగానే గోపి కళ్ళు అదేదో లోకంలో ఉన్నట్టున్నాయి. అప్పుడే ఛటుక్కున మేడ మీద శివుడు తన గదిలో ఏదో కేసెట్టు పెట్టాడు. ఆ పాట విన గానే గోపి కాళ్ళు ఎక్కడవక్కడే ఆగిపోయినయి. మనిషి కొయ్యబారిపోయాడు. ఏదో ఒక దేవగానం వింటున్నట్టూ కళ్ళు మూసుకున్నాడు. నాకు ఆశ్చర్యం వేసింది. కొన్ని క్షణాల్లో పాట ఆగింది. గోపి దగ్గరగా ఉన్న సోఫాలో కూచుండిపోయాడు. నేను ఉయ్యాలలో లేచి కూచున్నాను.

గోపి నిమ్మళంగా కళ్ళు తెరిచి "ఆ పాట విన్నావా, అక్కా!" అని అడిగాడు.

మరుక్షణం శివుడు తిరిగి కేసెట్టు పెట్టాడు. ఏమిటాపదం అని చెవులు ఒప్పగించాను నేను కూడా. నలుగురు ఆడవాళ్ల స్వరాలు కలిసిపాడుతున్న పాట వినిపించింది, మేడ మీద నించి.

"సోలెడు సోలెడు జొన్న లిస్తా.
సోలలో మాకు ఈనాం ఇస్తా.
కొయ్యారమ్మా వణతులారా.
ఈ చిత్ర జొన్న."

శివుడు కేసెట్ ఆపు చేశాడు. గోపి నిమ్మళంగా కళ్ళు తెరిచాడు. అప్పు డవి తెలివైన మామూలు కళ్ళు. ఒక్క క్షణంలో అతని కళ్లల్లో అంత మార్పు ఎలా వచ్చిందో! అసలైన గోపిని అప్పుడు చూచాను. పిచ్చి చూపు లేవీ లేవు. కళ్ళు గంభీరంగా కాస్త దుఃఖంగా కనిపించాయి. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఆ క్షణంలో గోపి మనస్సు గోపి స్వాధీనంలోనే ఉంది.

ఒక్క అంగలో నా వద్దకి వచ్చి క్రింద చతికిలపడి కూచున్నాడు. "అక్కా! ఒక్క పది నిమిషాలు ఇక్కడ కూచుంటావా? నీతో కొంచెం మాట్లాడాలి" అన్నాడు స్వతంత్రంగా.

"చెప్పరా నాయనా ఏం మాట్లాడదల్చుకున్నావో ఎంతసేపైనా సరే వింటాను". అన్నాను నా ఆశ్చర్యంలోనించి ఇంకా తెప్పరిల్లకుండానే.

"ఇప్పు డా పాట విన్నావా అక్కా?" అడిగాడు, ఏదో ఆలోచిస్తున్నట్టూ నిమ్మళంగా.

"విన్నానయ్యా" అన్నాను. "అది శివుడు గదిలో కేసెట్టు వేసుకుంటున్నాడు గాబోలు" అన్నాను మళ్లీ.

"ఇదే పాటక్కా ఇలాగే ఆడవాళ్లు పాడారు ఆ రాత్రి" అన్నాడు. నా మాట వినిపించుకున్నట్టుగా లేదు.

"ఏ రాత్రి?" అడిగాను.

"అసలు జరిగిందంతా వినక్కా" అన్నాడు - కాస్త అంతరంగంగా మాట్లాడేటట్టూనూ, ప్రాధేయపడుతూ.

"చెప్పు గోపీ" అన్నాను కాస్త చిరునవ్వుతో.

కాస్సేపు క్రిందికే చూస్తూ కూచున్న గోపి, కళ్లెత్తి చెప్పడం ఆరంభించాడు. "రాజ్యమూ, నేనూ కలిసి ఆడుకునేవాళ్లం. ఒకే స్కూల్లో చదివేం కూడా. ఒకే క్లాసు. కాని కాలేజి చదివులు ఆరంభించేసరికి ఆ అమ్మాయిని హైదరాబాదు పంపించేశారు. తనకి కావలసిన సబ్జక్టుల గ్రూప్ మా ఊళ్లో లేదు. నేను మాత్రం గ్రామంలో ఉన్న అమ్మకి దగ్గరగా ఉండాలని, ఆ బస్తీలోనే ధర్మారావుగారింట్లోనే ఉంటూ ఆ ఊరు కాలేజీలోనే చదువుతూండేవాణ్ని" అని కాస్త ఆగాడు.

"రాజ్యం ఎవరు ?" అడిగాను.

గోపీ ఎక్కడో చూస్తూ చెప్పనారంభించాడు.

"ఎప్పుడూ నాకు ఏవేవో సహాయాలు చేస్తూనే ఉండేది. నా కేమీ అర్థం అయ్యేది కాదు. ఇద్దరమూ ధర్మారావుగారి వద్దనే పెరిగాం. వాళ్లమ్మాయికీ, నాకూ వ్యత్యాసం లేకుండానే చూసేవారు ధర్మారావుగారు కాని, వారి భార్య మంగమ్మత్తయ్యా గాని, నాన్నకి ధర్మారావుగారు బాల్యమిత్రుడు గనుక రెండు కుటుంబాలూ బంధువుల్లానే ఉండేవాళ్లం....."

''అసలు ధర్మారావుగారెవరు గోపి?'' అడిగాను. అతను చెప్పడం కాస్త ఆపేటప్పటికి.

మళ్లా కళ్లెత్తి నా కేసి చూశాడు గోపి - ''ధర్మారావుగారు ఒక సంస్కారి. సంఘ సంస్కర్త అనాలక్కా. చాలా చదువరి. ధనవంతుడు. దేశ సేవకుడు. అందుకని వాళ్ల ఒక్కతే కూతురికి స్వరాజ్యలక్ష్మి అని పేరు పెట్టుకున్నారు. అదే రాజ్యం... అసలు ఆ రోజుల్లో నా కేమీ తెలిసేదే కాదక్కా. ఒకనాడు నా స్కూలు మిత్రుడితో వీధిలో నుంచుని చాలా తదేక ధ్యాసతో మాట్లాడుతున్నాను. ప్రక్క నుంచీ ఒక పెద్ద కొమ్ముల గేదె నడుచుకుంటూ నా మీదికే వస్తోందిట. నేను చూడనేలేదు. వాకిట లోపల చావిట్లో ఎదురుంగా తోటకూర కోస్తున్న రాజ్యం తోటకూర కట్టతో పరిగెట్టుకుని వచ్చి, ఆ బర్రెకి చూపించి, దాన్ని పక్కకి మళ్లించేసింది. నా మిత్రుడు తరువాత నాతో అన్నాడు. ఆ అమ్మాయి తోటకూర కట్ట చూపించక పోయినట్టయితే ఆ బర్రె తిన్నగా నీ మీదికి వచ్చును కదా. నేను కూడా అది రావడం గమనించనే లేదు. ఆ బర్రె బండదో ఒక కన్ను గుడ్డిదో. ఆ అమ్మాయి చాలా తెలివిగా చేసింది'' అని. ఇలాగే అక్కా ఏవేవో చిన్న సహాయాలు ఎన్నో చేసేది. ఏమిటి, అని ఎప్పుడూ నేను ఆలోచించలేదు.

''ఇంకొకటి జ్ఞాపకం వచ్చింది. ఓనాడు మంగమ్మత్తయ్య ములక్కాడలు పప్పు పులుసు చేశారు. అనుకోకుండా ఇంటికి పై మనుషులు వచ్చారు. అసలే ఆ ఇంటికి వచ్చేవాళ్లు, పోయేవాళ్లు ఎక్కువ. ఆఖరికి ఒక్క మనిషికి చాలే పులుసే వుంది. అత్తయ్య అంది గదా - ''అమ్మాయి - ములక్కాయలు గోపికి చాలా ఇష్టం గదా. ఎలాగ పులుసు చాలా తక్కువ ఉంది.'' దానికి రాజ్యం అంది - ''ఆ పులుసు గోపికే ఉంచమ్మా'' అంది. దానికి అత్తయ్య - ''అదేమిటమ్మాయ్? ములక్కాయ పులుసు నీ కసలే పంచప్రాణాలు గదా. అందుకనే గదా దగ్గర ఉండి మరీ 'కాయలు కోయించావు' అనడిగింది. రాజ్యం అంది గదా - ''నా కేమో ఈ వేళ ఆవకాయ మీదే ఉంది. నాకు ఆవకాయ చాలు.'' అప్పుడే చావిట్లోకి వస్తున్న నాకు ఈ సంభాషణ అంతా వినిపించింది.

గోపి మాట లాపి ఏదో ఆలోచిస్తున్నాడు.

''చెప్పు గోపీ!'' అన్నాను.

శివుడు గదిలోనించీ చప్పుడు లేదు. నోట్సు రాసుకుంటున్నాడో, ప్రయాణ బడలికలో కన్ను మూశాడో. నే నలాగే కూచుని ఉన్నాను ఉయ్యాలలో. గోపి కూడా వంచిన తల ఎత్తలేదు.

కాసేపయ్యాక మంత్ర ముగ్ధుడిలా చెప్పుకుపోనారంభించాడు గోపి.

"ఆ యేడు మేము ఎం.ఏ. తరగతిలో ఉన్నాం, రాజ్యం, నేనూ. రాజ్యం సంక్రాంతి సెలవులకి హైదరాబాదు నుండి ఇంటికి వచ్చింది. ధర్మారావుగారు మా కాలేజీ తెరవడానికి ఒక వారం ముందరే అమ్మ నడిగి వచ్చెయ్యమన్నారు నన్ను వాళ్లింటికి. అమ్మ నన్ను పంపించింది - భక్షాణాలతో బహుమతులతో, అక్కా! ఆ వారం రోజులూ ఎలా గడిచినాయో నాకే తెలియదు - ముచ్చట్లూ, మీటింగులూ ధర్మారావు గారి చర్చలూ, విందులూ, ఏమేమిటో.

ఆఖరు రోజున ధర్మారావుగారు బయటికి వెళ్లి వచ్చారు. రాగానే 'పక్క ప్రత్తిపాడు గ్రామంలో చెంచులక్ష్మి వీధి నాటకం వేస్తున్నారట ఈ రాత్రి. అసలు పురాతన కాలంలో మన దేశపు ప్రజా సంస్కృతి ఎలా ఉండేదో ఈ రోజుల పిల్లలకి కొంచెం కూడా తెలియడంలేదు. తెలుసుకోవలసిన అవశ్యం ఎంతో ఉంది. గోపీ! నువ్వూ, రాజ్యమూ ఇద్దరూ తప్పకుండా వెళ్లి చూసిరండి. ఇక్కడికి 4 పరుగుల దూరం. భోంచేసి నడిచి వెళ్లవచ్చు అన్నారు.

రాజ్యమూ, నేనూ గబ గబ నడిచివెళ్లాం. చుట్టూ పౌర్ణమి వెన్నెల, చల్లటి శీతగాలి వీస్తోంది. జనం గుంపులు గుంపులుగా వెళుతున్నారు. నాటకం గుడి దగ్గరట, గుడి ముందు కొబ్బరికాయలు, కర్పూరం, పువ్వులూ అమ్ముతున్నారు.

"నీకు పసుపు రంగు ఇష్టమేనా?" అడిగాను, రాజ్యాన్ని.

"చాలా" అంది క్లుప్తంగా. ఒక మూర చామంతి పువ్వులు కొని ఇచ్చాను. మారు మాట్లాడకుండా ఆప్యాయంగా అందుకుని కాస్త వాసన చూసి, వాలు జడలో పెట్టుకుంది. "ఈ చిన్న వాసన నాకు చాలా ఇష్టం" అంది నడుస్తూ. "వెన్నెలలో ఈ పువ్వులు మసకబారిన దివిటీలలా కనిపించినయి, రాజ్యం" అన్నాను. "బాగా అన్నావు గోపీ. చామంతి పువ్వుల అందం చూడాలంటే చలిగాలిలో లేత ఎండలో చూడాలి. మహాశాంతిగా కనిపిస్తాయి" అంది రాజ్యం.

మేము తీరా పందిరి దగ్గరికి వెళ్లేసరికి, ఆ వేళ నాటకం ఆగిపోయిందట, చెప్పారు. లక్ష్మి వేషం వేసే కుర్రాడికి ఏదో సుస్తీ చేసిందట. గ్యాస్ లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. వాటి చుట్టూ పిల్లలు మూగి తిరుగుతున్నారు. చూడవచ్చిన జనం నిలబడే ఒకళ్ల నొకళ్లు పిలుచుకుంటున్నారు. ఇహను చేసే దేమీ లేక మేము కూడా తిరుగు ముఖం పట్టాం. ఆ రోజు జరిగినదంతా కళ్లకి కట్టినట్టుంది.

దారిలో "కాళ్లు పీకుతున్నాయి గోపీ, కాసేపు, రెస్టు తీసుకుని వెడదాం'' అంది రాజ్యం.

కొండకి కాస్త దూరంలో పల్లంలో చాలా మేర పొట్టి పచ్చగడ్డి మొలిచి తివాసి పరిచి నట్టుంది.

"అక్కడ కాస్త విశ్రాంతి తీసుకుందాం" అన్నాను అటువేపు చెయ్యి చాచి చూపుతూ.

అంతే జవాబు లేకుండా నాతోపాటు అడుగులు వేసింది రాజ్యం. తనలో తానే చెప్పుకుపోతున్నాడు గోపి ఇప్పుడు.

"చుట్టూ చల్లని వెన్నెల అలుముకుంది. ఆకాశ మంతా నిర్మలంగా నిశ్చలంగా ఉంది. దూరాన ఉన్న కొండలూ, చెట్లూ నీడలలా కనిపిస్తున్నాయి. ఏ ఆకారానికీ నియమిత ఎల్లలు ఖచ్చితంగా కనబడడంలేదు. చుట్టూ ఉన్న దృశ్యాలన్నీ మృదువుగా ఆ లేత వెలుగులో కలిసిపోయినట్టున్నాయి. కాసేపు ఎవరమూ మాట్లాడలేదు. అంతా నిశ్శబ్దం. కాని అప్పుడప్పుడు వివరంలేని సందడులు వినిపిస్తూ ఉన్నాయి - నాటకం లేదని తిరిగిపోతున్న జనంలోనించి.

కాసేపు అలాగే నిశ్శబ్దంగా కూచుని ఉండిపోయాం.

"నువ్వు వచ్చే యేడు ఎంఏ పూర్తి అయ్యాక ఏం చేద్దామని ఉంది?'' అడిగాను రాజ్యాన్ని.

"హయ్యర్ స్టడీస్ కంటిన్యూ చేస్తావా, ఏదైనా స్పెషలైజ్ చేస్తూ'' పొడిగించాడు.

రాజ్యం నిట్టూర్చింది. జవాబు లేదు. రెండు కాళ్లు పక్కకి మడిచి ఒక్క చేతి మీద నేలను ఆనుకుని కూచునే ఉంది.

"నీ మనస్సులో ఉన్న విషయాలు ఎవ్వరితోనూ చెప్పవా? ఎందుకు ఇంత మౌనం? ఎప్పుడూ ఇంతే ఇంట్రోవర్టు నువ్వు అబ్బ!" అన్నాను.

కాసేపయ్యాక "నువ్వేం చేయదల్చుకున్నావు?" అడిగింది నన్ను.

"నాకేమీ ప్లాన్స్ లేవు. ఉండనే ఉందిగా స్వంత వ్యవసాయం" అన్నాను.

మరి కాసేపు నిశ్శబ్దం.

కాస్తాగాక కొండ కిందనించీ ఆడవాళ్ల గుంపు ఒకటి గొంతెత్తి పాడుకుంటూ వెళుతున్నారు. ఆ పదం వినిపించగానే రాజ్యం చెవులూ, హృదయమూ ఒప్పగించింది. నేను కూడా మైమరచి విన్నాను. ఒక ముఠా పాడి ఆపంగానే మరొక పాదం ఇంకో ముఠా అందుకుని పాడారు. ఇప్పుడు మనం విన్న పాటే అది.

"సోలెడు సోలెడు జొన్న లొద్దూ.
సోలలు మాకు ఈనాం వద్దు.
కొయ్యలేమో రెడ్డి కొడుకా.
ఈ చిత్ర జొన్న.
మానెడు మానెడు జొన్న లిస్తా.
మానికలు మీకు ఈనాం ఇస్తా.
కొయ్యరమ్మా పణతులారా.
ఈ పసిడి జొన్న.
మానెడు మానెడు జొన్న లొద్దూ.
మానికలు మాకు ఈనాం వద్దు.
కొయ్యలేమో రెడ్డి కొడుకా.
ఈ పసిడి జొన్న...."

ఆడవాళ్లు కాస్త దూరమైపోయారు. గొంతుకలు సన్నంగా తగ్గిపోయి గాలిలో లీనమై వినీవినిపించకుండా వెన్నెలతో కలసిపోయినయి. ఆ బృందగానం పక్క నున్న కొండకి తగిలి చిన్న ప్రతిధ్వని ఇచ్చింది. నిజంగానే, ఆ రాత్రివేళ దూరాన్నించీ వినీ వినిపించే అదృశ్యపడుచు గొంతుకలు ఎంతో మధురంగా వినవచ్చాయి.

రాజ్యంగాని, నేను గాని కాసేపు ఏమీ మాట్లాడలేకపోయాం. ఇంకా ఆ బృంద గానం చెవుల్లో వినిపిస్తూనే ఉంది ఇప్పటికీ'' అన్నాడు గోపి.

"తరువాత ఏమయింది, గోపీ?" అడిగాను.

"చెబుతున్నాగా" అంటూ చెప్పసాగాడు.

రాజ్యం కాస్తాగి - "అబ్బ! ఎంత బావుందో చూడు ఆ పదం! అన్ని స్త్రీ స్వరాలు ఈ వెన్నెలలో ఎక్కణ్ణించో వినరావడం, మనం ఏదో మరొక లోకంలో ఉన్నట్టుగా లేదూ?" అంది నిమ్మళంగా.

నేనూ నన్ను మరిచే ఉన్నాను ఆనందంతో. అయినా వెంటనే తెప్పరిల్లి "జానపదాలు దేశీయ నాగరికతకు నాడి పట్టు అంటారు గదా రాజ్యం. మన దేశపు వ్యవసాయ వాతావరణాన్ని ప్రతిబింబిస్తోంది, ఆ పదం'' అన్నాను.

దానికి రాజ్యం "అది ఒకటే కాదు. మితిమించిన పంటలు యజమానికి పండాలని ఒక Wishful thinking, ఒక ఆశతో కూడిన కోరిక సేవకులలోనూ, కూలి మాత్రమే కాదు - తన సంతోషంలో సోలలూ, మానికలూ ఈనాంగా ఇస్తానన్న యజమాని ఉదారత కూడా చూపుతూంది ఆ పాట'' అంది.

"అది కాస్త పూర్వపు భావాలు సూచిస్తోంది. ఫ్యూడల్ సెటప్" అన్నాను నేను.

వెంటనే రాజ్యం "ఏ రోజులైతేనేం, గోపీ! చరిత్రని మలచడమూ, మరుగు పర్చడమూ మంచిది కాదు, న్యాయం కాదు. అది దేశ ప్రగతికి భిన్నం. ఆ రోజుల సాంఘిక వ్యవస్థ అది" అంది - కాస్త ఉద్రేకంగానూ, ఎత్తు స్థాయిలోనూ.

నాకు కాస్త ఆశ్చర్యం వేసింది.

"ఇన్నాళ్ళు, ఈ ప్రసంగ ధోరణి ఎలా దాచి ఉంచావు - నీ మూగ మనస్సులో?" అన్నాను.

రాజ్యం తెలిసీ తెలియని చిరునవ్వుతో చూసింది నాకేసి. "దేనికైనా సమయమూ సందర్భం ఉంటాయి. అప్పుడే మూగి పెదవులు మాట్లాడతాయి'' అంది.

"ఏమో అమ్మా నిన్నర్థం చేసుకోడానికి నా కీ జన్మ చాలదు'' అన్నాను.

రాజ్యం నిమ్మళంగా ఒక్క నిట్టూర్పు విడిచింది. ఎందుకో చేత్తో అప్రయత్నంగా తలలో ఉన్న చామంతి పూలు సర్దుకుంది.

మరి కాసేపు మౌనం అయ్యాక "అమ్మా, నాన్న గాభరా పడతారు. వెళదాం పద" అంటూ లేచింది రాజ్యం.

"అవును రేపు నువ్వు హైదరాబాదు ప్రయాణం అవ్వాలి గదా మరి" అన్నాను నేను కూడా లేస్తూ.

"అంతే అక్కా" అన్నాడు గోపి, ఒక్క అరనిమిషం మౌనం అయ్యాక తల ఎత్తి నన్ను చూస్తూ.

"మరునాడు రాజ్యం బండి కదిలిందో, లేదో మా పాలేరు నాగయ్య వగర్చు కుంటూ వచ్చాడు. ఉన్నట్టుంది అమ్మకి అకస్మాత్తుగా సుస్తీ చేసిందట. ఇరుగు పొరుగు వాళ్లు బస్తీ తీసుకొచ్చి నర్సింగు హోమ్‌లో చేర్పేశారుట. తీవ్ర చికిత్స వార్డులో పెట్టాశారుట. గాబరాగా ధర్మారావుగారూ, నేనూ బయలుదేరి వెళ్లాం. తీవ్రమైన హార్టు ఎటాక్ వచ్చిం దన్నారు. అక్కడే ఒకటి రెండు రోజులు మానసిక నరకం అనుభవించిన తరువాత, ఒక 15 దినాలు డాక్టర్ల చేతుల్లోనే ఉండా లన్నారు. ఆ తరువాత కూడా చాన్నాళ్లు పరిపూర్ణ విశ్రాంతి అవసర మన్నారు. ఆమె ఎక్కువ కదలకూడదట. ధర్మారావుగారు డాక్టర్లతో ఆలోచించి, నన్ను చదువు మాన్పించి అమ్మతోపాటు గ్రామం తీసుకెళ్లి వదిలారు. అక్కడ అమ్మకి మందు లివ్వడం, ఇల్లు చూసుకోవడం, వ్యవసాయం చూసుకోవడం, రాత్రి, పగలూ విశ్రాంతి లేకుండా పనివాళ్ల సహాయంతో నెగ్గుకొచ్చాను. అమ్మకి డాక్టర్లు చెప్పిన విశ్రాంతి దొరికింది. కాని ఆమెకి తృప్తిగా లేదు. నేను ఒంటరిగా దివారాత్రులూ కష్టపడడం చూచి అమ్మ మరింత బాధపడేది.

సంవత్సరం తిరగకముందే అందరి సమ్మతం మీద దూరపు బంధువులలో తల్లిలేని పిల్ల కమల నిచ్చి నాకు పెళ్లి చేశారు. ఇంటికి ఒక రక్షణ వచ్చింది.

మండు టెండలో కమలని పురిటికి బస్తీలో నర్సింగు హోమ్‌కి తీసుకెళ్లాం. ప్రసాద్ పుట్టాడు. వైశాఖ పూర్ణిమనాడు.

అమ్మ తక్షణమే రాజ్యాని కిష్టమైన నేతి లడ్డూలు సింగు కొట్లో కొనిపించి, నాగయ్య చేతి కిచ్చి, ధర్మారావు గా రింటికి పంపించి రాత్రికి భోజనానికి వచ్చేస్తామని

చెప్పి రమ్మంది. నాగయ్య తిరిగి వచ్చి "సరే నన్నారుండి. అంతకముందే వారే ఇక్కడికి వస్తామన్నారుండి" అని చెప్తూండగానే ధర్మారావుగారి ఇంటి పని కుర్రాడు సైకిల్‌లో వగరుస్తుకుంటూ వచ్చి రాజమ్మగారు కాలుజారి దిగుడు బావిలో పడిపోయారుండి. అయ్యగారు మిమ్మల్ని వెంటనే రమ్మన్నారుండి' అన్నాడు గాభరాగా ఏకధాటిగా.

"నాకు గుండె లాగిపోయినయి అక్కా!"

గోపి నోట కాసేపు మాట రాలేదు. నేనూ మాట్లాడలేకపోయాను. కాస్త తెప్పరిల్లి చెప్పనారంభించాడు, గోపి తిరిగి.

రాజ్యం శవాన్ని వసారాలోకి తెస్తుండగా చూశాను. ఎండిపోయిన చామంతి పూలచెండు తలలో ఉంది. వైశాఖ పౌర్ణమి తెల్లటి వెన్నెలలో స్పష్టంగా కనిపించింది. ఇంత మండువేసవిలో చేమంతి పూ లెక్కడివి అనీ, ఇంత ఎండిపోయిన పువ్వు లెందుకమ్మా తలలో పెట్టుకుంది, అని అక్కడ గుమికూడిన అమ్మలక్కలు ఆశ్చర్య పోయారు.

"నా కాళ్ల క్రింద భూమి బద్దలయినట్టయింది. తల పగిలిపోతున్న ట్టయింది. నా కేమీ తెలియలేదు.

అంతే అక్కా! ఆ మరునాడు పొద్దున్న లేచేటప్పటికి నే నెక్కడ ఉన్నానో, నే నెవ్వరినో నాకు తెలియదు. నాకు ముచ్చెమటలు పోసినయి."

గోపి అలాగే నా ముఖంలోకి చూస్తూ ఉండిపోయాడు. నాకు మాట వెంటనే రాలేదు.

"రాజ్యాన్ని చంపిన నరహంతకుణ్ణి నేనే నక్కా, నేనే కదూ? నేనే!" అన్నాడు దృఢంగా.

"ముమ్మాటికీ నువ్వు కాదు" అన్నాను మాట నోట తెచ్చుకుని. "పరిస్థితుల ప్రభావం తమ్ముడూ ఇందులో ఎవ్వరిదీ తప్పు కాదు, నీ తప్పసలే కాదు, అందరూ నిర్దోషులే" అన్నాను.

"అయితే, నేను నరహంతకుణ్ణి కా దంటావా ?" అడిగాడు గోపి ఆతృతగా.

"కానే కాదు. నిశ్చయంగా కాదు గోపి. ఇలాంటి అనివార్యమైన పరిస్థితులనే మన పెద్దలు విధి అంటారు. ఏదో ప్రారబ్ధం. కర్మఫలం ఏ జన్మదయితేనేం. ఇంతకీ మన చేతుల్లో ఏముంది. అన్నీ లేవుగా?" అన్నాను, నా మనస్సుకి తోచినట్టు.

ఆ క్షణంలో గోపి కళ్లల్లో వచ్చిన తృప్తి నే నింకా మరువలేను.

బయట మెట్ల మీద నించి 'అమ్మాయ్' అని సింహగర్జన స్వరం వినిపించింది బ్రహ్మయ్యగారిది.

గోపి కళ్లు మారనారంభించినయి.

✤ ✤ ✤